క్లుప్తంగా

పశు వైద్యశిబిరం

వినుకొండ(నూజెండ్ల): పశువైద్యశిబిరాల ఏర్పాటు రైతులకు ఆర్థికంగా లాభసాటిగా ఉంటుందని నరసరావుపేట పశువైద్య ఉప సంచాలకులు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి. రామారావు తెలిపారు. వినుకొండ మండలంలోని పెదకంచర్ల గ్రామంలో శుక్రవారం గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గన్న ఆయన పశుపోషకులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఈపూరు మండల సహాయ సంచాలకులు డాక్టర్ పి.శ్రీనివాస మూర్తి, పశువైద్యులు డాక్టర్ బిల్లా శేఖర్, వి.గోపాల్‌నాయక్, దిరిశాల వెంకటశివాజీ, మనోజ్, పశు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మెటీరియల్ పంపిణీ

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను నరసరావుపేటకు చెందిన బొల్లు రాజేశ్వరి కృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు వై.హనుమంతరావు అందజేశారు. రూ.6 వేల రూపాయలు విలువచేసే స్టడీమెటీరియల్‌ను 15 మందికి అందజేశారు. ఈ మెటీరియల్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



నరసరావుపేట: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మంచి పాలన అందిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం పట్టణంలోని 03, 11 వార్డుల్లో ప్రారంభించారు. వంద రోజులు ఎన్డీఏ పాలనలో సీఎం చంద్రబాబు నాయుడు అనేక సంక్షేమ పథకాలతో ప్రజల చేత ఇది మంచి ప్రభుత్వమని అనిపించుకున్నారన్నారు. అధికారులు,ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సహాయం



నరసరావుపేట ఈస్ట్: పెనుగొండ వెంకటేశ్వరరావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 58 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.3 వేలు చొప్పున రూ.1.74 లక్షల రూపాయలను పంపిణీ చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు పెనుగొండ వెంకటేశ్వరరావు ఆర్థిక వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించారు. గత 14 సంవత్సరాలుగా పేద ఆర్యవైశ్య విద్యార్థుల చదువుకు ఉపయోగపడేలా ఆర్థిక సహకారం అందిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో శ్రీవాసవీ మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, మండవ పూర్ణచంద్రరావు, పి.ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా హెచ్ఐవీ ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో ఏడుకొండలు, ఆశ, వై.విజయ, ఎస్‌కే రహ్మతా, రిబ్కా, సురేష్, రోజా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో బీసీ కాలనీలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం నిర్వహించినట్లు మండల బీజేపీ నాయకులు గట్టుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశంలో బీజేపీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన రావటం ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో మంచి పరిపాలనకు శుభపరిణామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పి.పూర్ణచంద్రరావు, మేడం రమేష్, కస్తూరి వెంకటేశ్వర్లు, కాకుమాను నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వాహనానికి నిప్పుపెట్టారు



బొల్లాపల్లి: గుర్తుతెలియని వ్యక్తులు కారుకు నిప్పంటించిన సంఘటనలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బండ్లమోటు ఎస్ఐ ఎ.బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. మండలంలోని మూగచింతలపాలెం గ్రామంలో అర్ధరాత్రి 2.30 సమయంలో తన వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ లేదా డీజిల్ పోసి నిప్పటించారని వాహనదారుడు పోకా వెంకట్రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వాహనానికి మంటలు వ్యాపించడంతో పరిసర ఇళ్ల వారు గుర్తించి మంటలను అదుపు చేశారని ఫిర్యాదు దారుడు ఫిర్యాదులో పేర్కొన్నాడని వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు.

హామీలిచ్చారు.. అమలు మరిచారు!!

- ఇంకా అమలు కాని హామీలు
- ఆచరణకు నోచుకోని పథకాలు
- చిలకలూరిపేటలో ఇదీ కూటమి వంద రోజుల పరిపాలన తీరు!

ఎవరైనా చేస్తామన్నది ముందే చెప్పి ఆనక దాన్ని అమలు చేసి చూపిస్తారు. కానీ కూటమి నేతలు పాలనలోకి వచ్చేందుకు హామీలు గుప్పించి ఇవాళ వాటి ఊసే మరచిపోయిన వైనాన్ని పేట వాసులు గుర్తు చేసుకుంటున్నారు. నాడు ఓట్లు వేయించుకునేందుకు, ఓటర్ల మనసు గెలుచుకునేందుకు గొప్పలకు పోయి ఇచ్చిన హామీల ఊసుల జాడలు ఇవాళ చూద్దామన్నా కనపడటం లేదు. ఇచ్చిన హామీల వైపునకు ఈ వంద రోజుల్లో పాలకులు ఒక్క అడుగు వేసిన పాపాన పోలేదు. సూపర్ సిక్స్ పేరిట ఓటర్లను నమ్మించారు. వాటిని అమలు చేయకుండా నిలువునా వంచించారు.





ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఈనాడుకు ఇచ్చిన ఇంటర్వ్యూ చిత్రం

చిలకలూరిపేట: ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అన్న చందాన ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో సూపర్ సిక్స్ మోసాలకు చంద్రబాబు పాల్పడితే... అదే బాటలో నియోజకవర్గ స్థాయిలో ఇచ్చిన హామీలను ఎటువంటి గ్యారెంటీ లేకుండా పోయింది. ఎన్నికలకు ముందు ప్రస్తుత ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు నియోజకవర్గ అభివృద్ధి అనేక హామీలు ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి 100 అయినప్పటికీ ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకున్న దాఖలాలు కానరావడం లేదు.

ఆటోనగర్ ఏర్పాటేదీ?

ముఖ్యంగా ఆటోమొబైల్ పరిశ్రమపై అత్యధికంగా ఆధారపడి ఉన్న కార్మికుల కోసం ఆటోనగర్ ఏర్పాటు ఒకటి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆటోనగర్‌కు అవసరమైన అన్ని అనుమతులు క్లియర్ అయి ప్లాట్ల పంపిణీకి రంగం సిద్ధం కాగా, ప్లాట్లు పొందేవారు వారి వంతుగా చెల్లించాల్సిన వాటాను చెల్లించాల్సిన అవసరం లేదని, కూటమి ప్రభుత్వం వస్తే ఉచితంగా ప్లాట్లు పంపిణీ చేస్తామని హామీల జల్లు కురిపించారు. దీంతో ఆశపడిన ఆటోరంగ కార్మికులు తమ వంతు వాటా చెల్లించకుండా వేచి చూశారు. కానీ ఇప్పటి వరకు ఆటోనగర్ ఏర్పాటు విషయంలో ఎలాంటి ముందడుగు పడక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఆగి పోయి ఉంది.



యడవల్లిలో టీడీపీ వర్గీయులు కూల్చి వేయగా నేలమట్టమైన ఏడుకొండలు ఇల్లు (ఫైల్)



అభివృద్ధికి నోచుకోని ఆటోనగర్

సూపర్ సిక్స్ ఎక్కడ?

ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాల ద్వారా ఏ ఇంటికి ఎంత లబ్ధి చేకూరుతుందో టీడీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు.

- తల్లికి వందనం పథకం కింద స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15 వేలు ఇస్తామని చెప్పారు. కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి ఇస్తామని నమ్మబలికారు. దీని ప్రకారం నియోజకవర్గంలో 41,361 మంది విద్యార్థులు ఉండగా, వీరికి రూ. 15 వేల చొప్పున అందరికీ కలిపి ఈ ఏడాది రూ. 62.04 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఒక్క విద్యార్థికి ఈ పథకం అందలేదు.
- 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య మహిళలకు నెలకు రూ. 15 వందలు చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ పథకంలో భాగంగా నియోజక వర్గంలోని సుమారు 95 వేల మందికి రూ. 1500 చొప్పున రూ. 14.25 కోట్లు చెల్లించాలి.
- ప్రతి ఇంటికీ ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఇస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలో 1,18,968 ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పటికీ ఒక్క గ్యాస్ సిలెండర్ కూడా ఉచితంగా ఇవ్వలేదు.
- ప్రతి రైతుకు ఏటా రూ. 20వేల చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని ఇచ్చిన హామీ ప్రకారం నియోజకవర్గ పరిధిలో ఉన్న 27,594 మంది రైతులకు రూ. 55.19 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఆర్థిక సహాయం ఊసే లేదు.
- నిరుద్యోగ యువతకు నెలకు రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ఇచ్చిన హామీ ప్రకారం 80 వేల మందికి కలిపి రూ. 24 కోట్లు ఏడాదికి చెల్లించాల్సి ఉంటుంది.
- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గ పరిధిలో లక్షా 50 వేల మందికి ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలి. ఈ పథకాలలో ఏ ఒక్కటీ ఆచరణకు నోచుకోకపోవడంతో మోసపోవడం ప్రజలవంతుగా మారింది.

రెడ్ బుక్ రాజ్యాంగం!

ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలు అమలు కానప్పటికీ టీడీపీ పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగం మాత్రం శ్రేష్టంగా అమలు పరుస్తున్నారు. శిలాఫలకాల తొలగింపు, గ్రామ సచివాలయాలపై దాడులు చేసి బోర్డుల తొలగింపుతో పాటు దౌర్జన్యకాండ కొనసాగిస్తున్నారు. ఉదాహరణకు కొన్ని... పట్టణంలోని పురుషోత్తమపట్నంకు చెందిన వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గాలిబ్‌షా కుమారుడు యాసిర్ అరాఫత్‌పై టీడీపీ వర్గీయులు జూన్ 23వ తేదీన కత్తులతో దాడి చేసి హత్యా ప్రయత్నం చేశారు. చిలకలూరిపేట మండలం గోపాళంవారిపాలెం గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ జడ ఆనంద్‌ను ఉద్యోగం విడిచిపెట్టి వెళ్లాలని వేధించటంతో జులై 11వ తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు. యడవల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ వర్గీయులు ఉయ్యాల ఏడుకొండలు ఇంటిని ఆగస్టు 19 కూల్చి వేసి శిధిలాలను తీసుకు వెళ్లి వాగులో కలిపారు. పోతవరం గ్రామానికి చెందిన యలమంద జానీబాషను ఆగస్టు 30న దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటనలో ఆసుపత్రి పాలయ్యాడు. ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఏదో వందరోజుల పాలన అద్భుతం అంటూ ప్రచార పర్వానికి తెరలేపడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.



ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ జడ ఆనంద్ (ఫైల్)



కొండవీడు ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగి పడి ఉన్న దృశ్యం (ఫైల్)



దాడిలో గాయపడిన యలమంద జానీ బాష (ఫైల్)

ఒక్కరూపాయి ఇవ్వలేదు!

పట్టణ ప్రజలకు మేలు చేసే మంచినీటి అమృత్ పథకానికి నిధులు మంజూరు చేయించి వెంటనే పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమృత్ స్కీంకు నేటి వరకు ఒక్క రూపాయి నిధులు మంజూరు కాలేదు. ఇక నియోజకవర్గ పరిధిలో మరమత్తులకు గురైన ఎత్తి పథకాల పథకాలను పూర్తి స్థాయిలో పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీ సైతం హామీగానే మిగిలి ఉంది.

పర్యాటకంపై కపట నాటకం!

కొండవీడు కోటను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఘనంగా చెప్పుకున్నప్పటికీ ఆ దిశగా సైతం అడుగులు పడిన దాఖలాలు లేవు. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి కొండచరియలు ఘాట్ రోడ్డుపై విరిగి పడటం పరిపాటిగా మారింది.

ఆటల పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



యద్దపాడులో వాలీబాల్‌తో తలపడుతున్న క్రీడాకారులు



బొల్లాపల్లిలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో -2 కె.పార్వతి, ప్రధానోపాధ్యాయులు

నాదెండ్ల: యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, ఎంపిక పోటీలు నిర్వహించారు. హెచ్ఎం భారతీదేవి, ఎంఈవో నాగరత్నం పర్యవేక్షించారు. 200 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. అండర్14, అండర్ 17 బాలబాలికల విభాగాల్లో క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ క్రీడల ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వెల్లడించారు. అనంతరం పీఈటీ కటూరి కృష్ణన్ పదవీవిరమణ సందర్భాన్ని పురస్కరించుకుని సత్కారించారు. కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మధుబాబు, పీఈటీలు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: మండలంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో క్రీడా పోటీలు శుక్రవారం ఎంఈవో -2 కె.పార్వతి ప్రారంభించారు. ఈ పోటీలను మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో అండర్ -14 , అండర్-17 విద్యార్థినీ విద్యార్థులకు పలు విభాగాల్లో మండలస్థాయిలో పోటీలు నిర్వహిస్తామని, గెలుపొందిన వారికి నియోజకవర్గ, జిల్లాస్థాయిలో పోటీలు జరుగుతాయని తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్ విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. మండలస్థాయి విజేతలను నియోజకవర్గ స్థాయికి పంపుతామని తెలిపారు.

నాదెండ్ల మండలంలో...

నాదెండ్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం వెంకటరావు, మండల క్రీడాశ్రీ కేవీ నాగరాజు పోటీలను ప్రారంభించారు. అండర్ 17 బాయ్స్ వంద మీటర్ల విభాగంలో ఎండుగుంపాలెం హైస్కూల్ విద్యార్థి నరేష్, సాతులూరు విద్యార్థి పర్వీన్‌లు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో డి యామినికే (కనపర్రు), దీపిక (ఎండుగుంపాలెం) ఎంపికయ్యారు. అండర్ 17 కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్‌లో మండలస్థాయి క్రీడాకారులను ఎంపిక చేశారు.

రొంపిచర్ల ఆట ఆడే క్రీడాకారులు వీరే



నాదెండ్ల మండల కబడ్డీ క్రీడాకారులు



ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. అథ్లెటిక్స్‌లో లాంగ్ జంప్, హైజంప్ కు అండర్-17 విభాగంలో సంతగుడిపాడు కేజీబీవీ పాఠశాలకు చెందిన వి. వనజ, ఎం.ఝాన్సీలు ఎంపికయ్యారు. షార్ట్‌పుట్ ఏపీ మోడల్ స్కూల్ నుంచి ఎం.హెచ్. మాధవి, ఆర్. విష్ణుప్రియ, కేజీబీవీ నుంచి జి. గ్లోరీ, 100 మీటర్స్ విభాగంలో ఏపీ మోడల్ స్కూల్ ను ఎం.హెచ్. మాధవి, కేజీబీవీ నుంచి వి. వనజ, రొంపిచర్ల జెడ్పీ హైస్కూల్ నుండి ఓ. అమూల్య, 200 మీటర్స్‌లో ఏపీ మోడల్ స్కూల్ నుండి ఎం.హెచ్. మాధవి, రొంపిచర్ల జెడ్పీ హైస్కూల్ నుంచి పి. గీతాలక్ష్మీ, ఓ. అమూల్య, కబాడీలో ఏపీ మోడల్ స్కూల్ నుంచి ఆర్. విష్ణుప్రియ, ఎం.హైమాదేవి, జెడ్పీహెచ్ఎస్ రొంపిచర్ల నుండి ఎ. నవ్య, వాలీబాల్‌లో కేజీబీవీ నుండి టి. దుర్గామహేశ్వరి, చెస్‌లో జెడ్పీహెచ్ఎస్ నుండి జి.పార్వతీ, కె.శ్రీవిద్యలు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో షార్ట్‌పుట్ జెడ్పీహెచ్ హైస్కూల్ రొంపిచర్ల నుంచి బి.శ్రీలక్ష్మీ, ఎం. హారిక, కేజీబీవీ సంతగుడిపాడు నుండి జి. వర్షిత, 100 మీటర్స్ రన్నింగ్‌లో జెడ్పీహెచ్ఎస్ రొంపిచర్ల నుంచి పి. చంద్రిక, వి. శ్రీదేవి. ఏపీ మోడల్ స్కూల్ నుంచి కె. జెస్సీ, 200 మీటర్ల పరుగులో జెడ్పీహెచ్ఎస్ రొంపిచర్ల నుంచి పి. చంద్రిక, కేజీబీవీ సంతగుడిపాడు నుంచి జి. వర్షిత, చెస్‌లో జెడ్పీహెచ్ఎస్ రొంపిచర్ల నుండి పి. మహిమ, ఏపీ మోడల్ స్కూల్ రెడ్డిపాలెం నుంచి సాంబవి, యోగాలో కేజీబీవీ సంతగుడిపాడు నుంచి ఎం. గురువర్ధని, ఎం. సంగీతలు ఎంపికయ్యారని పీడీ సైదయ్య తెలిపారు. అలాగే బాలుర విభాగంలో 100 మీటర్స్ రన్నింగ్‌లో జెడ్పీహెచ్ఎస్ రొంపిచర్ల నుంచి ఎం. ప్రేమ్‌కుమార్, బి. బాలకృష్ణ, ఏపీ మోడల్ స్కూల్ నుండి విజయ్‌కుమార్, 200 మీటర్స్‌లో ఏపీ మోడల్ స్కూల్ నుంచి ఎం. విజయ్‌కుమార్, జెడ్పీహెచ్ఎస్ రొంపిచర్ల నుంచి ఎస్‌కే. సాహి, సంతగుడిపాడు నుంచి వి.సందీప్, 400 మీటర్లకు కేజీబీవీ సంతగుడిపాడు నుంచి బి. నందిని, 800 మీటర్స్‌కు ఏపీ మోడల్ స్కూల్ నుంచి బి. విజయ్‌కుమార్, కె.నిఖిల్‌రెడ్డిలు ఎంపికయ్యారు. ఖోఖోలో కె. లాస్య, అక్షిత రాణి, పి. చంద్రిక, ఎం. హారిక, బి. అంజలి, ఎస్‌కె. హారిన్, కె. దీపిక, పి. గాయత్రీ, ఎస్‌కె. సమీరా, ఓ. పావని, ఈ. శ్రీదేవిలను ఎంపికయ్యారని పీడీ తెలిపారు.

వ్యూడైస్ సమాచారంలో తప్పులు దొర్లనివ్వకండి



మాట్లాడుతున్న ఎంఈవో -2 కె.పార్వతి

బొల్లాపల్లి: పాఠశాలకు సంబంధించి ప్రధానోపాధ్యాయులు అందజేసే వ్యూడైస్ సమాచారంలో తప్పులు లేకుండా పొందుపరచాలని ఎంఈవో-2 కె.పార్వతి తెలిపారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో మండల స్థాయిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, పాఠశాలల్లో ఉన్నతాధికారుల తనిఖీలు ఉంటాయని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని జాగ్రత్తగా పొందుపరచుకోవాలని సూచించారు. అనంతరం పలు పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయుల నుంచి కోడిగుడ్ల సరఫరా సమస్యను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. నెలకు నాలుగు పర్యాయాలు పాఠశాలలకు కోడిగుడ్ల సరఫరా జరగాల్సి ఉందని, ప్రస్తుతం రెండుసార్లు మాత్రమే సరఫరా చేస్తున్నారని, ఈ సరఫరాలో మురిగిపోయిన కోడిగుడ్లు ఉంటున్నాయని, ఆన్‌లైన్‌లో పొందుపరిచిన సమాచారంతో నిమిత్తం లేకుండా పాఠశాలలకు సరఫరా చేస్తున్న కోడిగుడ్ల విషయంలో వ్యత్యాసం ఉంటుందని సమావేశంలో ప్రధానోపాధ్యాయులు వివరించారు. ఈ విషయంపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

మొక్కుబడిగా విజిలెన్స్ విచారణ

వినుకొండ(నూజెండ్ల): రేషన్‌షాపుల్లో బియ్యం పంపిణీపై విజిలెన్స్ అధికారులు మొక్కుబడిగా విచారణ చేశారని సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ ఇటీవల తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని ఇవ్వకుండా నగదు ఇస్తూ అక్రమ బియ్యం వ్యాపారానికి పాల్పడుతున్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు సమర్పించామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఉలవలపూడి రాము, వెంకటేశ్వర్లు, యోహాను పాల్గొన్నారు.

రేషన్ డీలర్లతో తహసీల్దారు భేటీ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌షాపు డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తహసీల్దార్ సురేష్‌నాయక్ పాల్గొని మాట్లాడుతూ డీలర్లు ఏదైనా ఇబ్బందులకు గురి చేయడం, మోసాలకు పాల్పడడం వంటివి చేస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ప్రతి ఒక్క కార్డుదారునకు రేషన్ సరుకులు ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ఎటువంటి ఆటంకం లేకుండా అందించాలని సూచించారు.

క్రమశిక్షణతో లక్ష్యాలను సాధించుకోవాలి

- ఎన్ఈసీ ఛైర్మన్ ఎం.వీ కోటేశ్వరరావు
- ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల సెక్రటరీ మిట్టపల్లి రమేష్, చక్రవర్తి, ప్రిన్సిపల్, అధ్యాపకులు



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

నరసరావుపేట: విద్యార్థులు క్రమశిక్షణతో తమ లక్ష్యాలను సాధించుకోవాలని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల (ఎన్ఈసీ) ఛైర్మన్ ఎం.వీ కోటేశ్వరరావు కోరారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలలో పాల్గొని వారిని ఉద్దేశించి మాట్లాడారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు రెండో ఏడాది విద్యార్థులు స్వాగతం పలకటం అభినందనీయమని అన్నారు. వైస్ ఛైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి మాట్లాడుతూ భవిష్యత్ నిపుణులను రూపొందించడంలో సాంకేతిక విద్య ప్రాముఖ్యతను చాలా ఉందన్నారు. విద్యతో పాటు పాఠ్యేతర కార్యకలాపాల మధ్య సమతుల్యతను కొనసాగించాలని విద్యార్థులకు సూచించారు. విజయాన్ని సాధించడంలో ఆత్మ విశ్వాసం, సంకల్పం ఉండాలని అన్నారు. కళాశాల కల్పించిన వనరులను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని నూతన విద్యార్థులకు సూచించారు. సెక్రటరీ మిట్టపల్లి రమేష్ విద్యార్థులు వ్యక్తిగతంగా విద్యాపరంగా ఎదిగేందుకు సహాయపడే సహాయక వ్యవస్థల గురించి వివరించారు. ఫ్రెషర్స్ నైతిక విలువలను కాపాడుకోవాలని, దేశ నిర్మాణ ప్రక్రియకు సహకరించాలని ఆయన కోరారు. తొలుత జ్యోతి ప్రజ్వల అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు సాదర స్వాగతం పలికారు. వైస్ ప్రిన్సిపాల్, డాక్టర్ డి. సునీల్, ప్రథమ ఏడాది డీన్ డాక్టర్ హరికృష్ణప్రసాద్ మాట్లాడారు. ద్వితీయ ఏడాది విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఉత్సాహభరితమైన పండుగ వాతావరణాన్ని జోడించాయి. శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, పాటలు, జూడో, యోగా, స్కిట్లుతో విభిన్న ప్రతిభను ప్రదర్శించి ఆనందకరమైన వాతావరణాన్ని విద్యార్థులు సృష్టించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమీ లేదు

సీపీఐ నేత ఏపూరి



మాట్లాడుతున్న గోపాలరావు

వినుకొండ(నూజెండ్ల): మాది మంచి ప్రభుత్వమంటూ చంద్రబాబు, వికసిత్ భారత్ అంటూ మోదీ ప్రచారాలు చేయడమే తప్ప పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి కోసం చేసిందేమీ లేదని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు అన్నారు. స్థానిక పుతుంబాక వెంకటపతి భవన్‌లో సుందరయ్య నగర్ శాఖ మహాసభ నిర్వహించారు. తొలుత సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ ప్రజల అభివృద్ధి కోసం ప్రయత్నాలు చేయడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఈ వంద రోజుల పాలనలో ఏం చేశారో చెప్పాలన్నారు. దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కె.హనుమంతరెడ్డి, పట్టణ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు, ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.